కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -215 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 16-08-2026 ఆదివారం పేజీలు : 4

# స్వాతంత్ర్య వేళ అభివృద్ధి సంకల్పం

- ఎర్రకోటపై మోదీ.. వికసిత్ భారత్ లక్ష్యం
- దేశ నిర్మాణమే ధ్యేయం.. చంద్రబాబు సంకల్పం
- గోల్కొండపై రేవంత్.. తెలంగాణ ప్రగతి పథం
- ఆత్మనిర్భర భారత్ దిశగా కీలక అడుగులు
- రైతు, మహిళా సంక్షేమానికి పెద్దపీట



**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందన్నారు ప్రధాని నరేంద్ర మోదీ . సరికొత్త తీర్మానాలతో సరికొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతోందని.. గతంలో బలహీన దేశంగా ఉన్న భారత్ 12 ఏళ్ల తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా మారిందన్నారు. కొత్త ఉత్సాహంతో వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేసి ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలోని ప్రతి హృదయం వందేమాతరం నినాదంతో ధ్వనిస్తోందన్నారు ప్రధాని. దేశవ్యాప్తంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురుతోందన్నారు. ఎందరో వీరుల బలిదానాల ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చిందని. ఎర్రకోట వద్ద తొలిసారిగా వందేమాతరం గీతాన్ని ఆలపించామన్నారు.

సంకల్పం దృఢంగా ఉంటే కఠిన సవాళ్లను సునాయాసంగా ఎదుర్కోవచ్చన్నారు ప్రధాని మోదీ. 'ఆత్మనిర్భర భారత్ సాధనే మన లక్ష్యం.. ఆత్మ విశ్వాసం పెంచుకోవడంతోపాటు స్వయం సమృద్ధి సాధించాలి. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో ముందుకెళ్తున్నాము. మనం పెద్ద కలలు కనాలి.. దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలి. ప్రపంచం భారత్ చారిత్రక విజయాలవైపు చూస్తోంది. నా దేశ యువకులు, మహిళలు, రైతులు, శ్రామికులపై నాకు భరోసా ఉంది.. త్వరలోనే మరికొన్ని సంస్కరణలు తీసుకురాబోతున్నాము. భారత ప్రజల్ని భయపెట్టడం వల్ల ఆనందం పొందాలని కొందరు చూస్తున్నారు.. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ఎరువులు దొరకవు అన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా దేశానికి లోటు రానివ్వలేదు. భారత్ తన సామర్థ్యంతో ముందుకు వెళుతోంది. అలాగే 25 కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేశాము' అన్నారు ప్రధాని మోదీ.

2 లో



2 లో

## నేల నుంచి మంటలు

- గోమియాలో వింత ఘటనతో భయాందోళనలు
- భూగర్భ వాయువుల లీకేజీపై అనుమానాలు
- రంగంలోకి దిగిన నిపుణుల బృందం
- మంటల వెనుక అసలు కారణమేంటి?
- సమీపంలోనే ఓఎన్జీసీ గ్యాస్ ప్రాజెక్టు
- ప్రజలు దూరంగా ఉండాలని అధికారులు

## పల్లీ పట్టీలపై షాకింగ్ తనిఖీలు




2 లో

గడువు ముగిసిన పదార్థాలతో చిక్కీలు
ఫుడ్ సేఫ్టీ దాడుల్లో ఇద్దరి అరెస్ట్
రూ.4 లక్షల నాసిరకం సరుకు స్వాధీనం

## దేశ నిర్మాణమే ధ్యేయం.. చంద్రబాబు సంకల్పం

20 ఏళ్ల లక్ష్యంతో ఏపీని ముందుకు
దేశమే బాధ్యతగా ముందుకు సాగాలి
పునర్నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
వికసిత్ భారత్‌కు ఏపీ బలమైన రాష్ట్రం



2 లో

**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయపూడి పరేడ్ గ్రౌండ్స్‌లో తొలిసారిగా నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు జాతీయజెండాను ఎగుర వేశారు. అనంతరం రాష్ట్ర ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఎంతోమంది మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు చంద్రబాబు. దేశ, రాష్ట్ర భవిష్యత్తును గొప్పగా నిర్మించడమే మహనీయుల త్యాగాలకు నిజమైన నివాళి అని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరి చేతిలో జాతీయ జెండా ఉండాలి.. గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలన్నారు. స్వాతంత్ర్య సమరంలో తెలుగు నేలకు ముఖ్య పాత్రం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దేశం మనకు హక్కులు, గుర్తింపు, గౌరవం ఇచ్చిందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

తెలంగాణ ప్రగతికి వేగం పెంచేలా
నీటి హక్కులపై రాజీ లేదన్న సీఎం
ఆడబిడ్డల ఆర్థిక సాధికారతకు పెద్దపీట
తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం




2 లో

**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలుఘనంగా జరిగాయి. జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రులు పతాకావిష్కరణ చేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోల్కొండ కోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తొలిసారిగా వందేమాతరం గీతాలాపన చేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన సీఎం.. రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

గోల్కొండ కోట వేదికగా నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి తన ప్రభుత్వ 32 నెలల పాలనలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన పురోగతిని వివరించారు. ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు ఇప్పుడిప్పుడే స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు.

## ఇండోనేషియాలో భారీ భూకంపం



2 లో

- ఫ్లోరెస్ దీవిని కుదిపేసిన పెను భూకంపం
- శిథిలాల కింద చిక్కుకున్న పలువురు
- సునామీ హెచ్చరికతో తీరప్రాంతాల్లో అలర్ట్
- రోడ్లు ధ్వంసం.. సహాయక చర్యలకు ఆటంకం
- ముమ్మరంగా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

## మోడీ ఫొటోపై పీసీసీ చీఫ్ ఫైర్

- ఫొటోల కోసం రాజకీయాలు వద్దన్న మహేశ్
- బీజేపీ డిమాండ్‌పై ఘాటు విమర్శలు
- విభజన హామీలపై దృష్టి పెట్టండి
- కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచన
- ప్రజా సమస్యలే కాంగ్రెస్‌కు ప్రాధాన్యం
- రేషన్ కార్డులపై ముదురుతున్న రాజకీయ పోరు



2 లో

## కాంగ్రెస్ చేరికలపై రాజగోపాల్ రెడ్డి ఫైర్

పాత నేతలకు ప్రాధాన్యం తగ్గిందంటూ వ్యాఖ్యలు
వచ్చినోళ్లకు.. చేర్చుకున్నోళ్లకు బుద్ధి లేదంటూ ఫైర్
బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలపై అభ్యంతరం
పోచారం, దానం చేరికలపై ఘాటు వ్యాఖ్యలు
మహేశ్ హెచ్చరికకు రాజగోపాల్ కౌంటర్
చేరికలపై రేవంత్ ఆలోచించాలంటూ సూచన



2 లో

## వందేమాతరంపై వివాదం

సోనియా తీరుపై దుమారం
కాంగ్రెస్‌పై విపక్షాల ఫైర్
జాతీయ గేయంపై రచ్చ
సోనియా వ్యాఖ్యలపై చర్చ
వీడియోతో రాజకీయ వేడి



2 లో

**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** దేశ 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ కాంగ్రెస్ అగ్రనేత, సీపీపీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం 'వందేమాతరం' గీతాలాపన జరుగుతుండగా.. ఆమె గేయాన్ని మధ్యలో ఆపాలంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. జాతీయ గేయం కొనసాగుతుండగానే సోనియా గాంధీ 'ఆపండి' అంటూ చేతులతో సైగలు చేయడం, పక్కనే ఉన్న మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో అసహనంగా వాదించడం, ఆ వెంటనే నిర్వాహకుడిని పిలిచి గీతాన్ని నిలిపివేయాలని ఆదేశించినట్లు ఉన్న వీడియో వైరల్‌గా మారింది.

## తిరంగా యాత్రకు అడ్డంకులు

దేవేంద్రనాథ్ మహతో అరెస్ట్?
రాంచీలో పోలీసుల మోహరింపు
విద్యార్థులతో పోలీసుల వాగ్వాదం
తిరంగా యాత్రపై ఆంక్షలు
మహతోకు స్వల్ప గాయాలు
నిరుద్యోగుల ఆందోళన తీవ్రం



2 లో

**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జేఎస్ఎస్‌సీ ఉద్యోగ నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ రోజు విద్యార్థులు, అభ్యర్థులు తిరంగ యాత్రకు పిలుపునిచ్చారు. దీంతో విద్యార్థి నాయకుడు, జేఎల్‌కేఎం నేత దేవేంద్ర నాథ్ మహతోను పోలీసులు ఆసుపత్రి నుంచి బయటకు రాకుండా అడ్డుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గత 14 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న ఆయన, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ..

## దేశ ప్రగతిపై ఖర్గే ఫైర్

90 శాతం క్రెడిట్ కాంగ్రెస్‌దే
బీజేపీపై ఖర్గే తీవ్ర విమర్శలు
నెహ్రూ సేవలను గుర్తుచేసిన ఖర్గే
మోదీ సర్కార్‌పై ఘాటు వ్యాఖ్యలు
యువత సమస్యలపై ఖర్గే ఆగ్రహం



2 లో

**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** ఆధునిక, ప్రజాస్వామిక, లౌకిక భారతదేశ నిర్మాణానికి పునాది వేసింది కాంగ్రెస్ పార్టీయేనని, ప్రస్తుత దేశాభివృద్ధిలో 90 శాతం కాంగ్రెస్ పార్టీ కృషియే ఉందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నెహ్రూ ఐఐటీలు, ఐఐఎంలు, పీఎస్‌యూలను స్థాపించి దేశాన్ని ప్రగతిపథంలో నడిపించారని, లాల్ బహదూర్ శాస్త్రి హరిత, శ్వేత విప్లవాలకు బాటలు వేశారని, ఇందిరా గాంధీ సైనిక పాటవాన్ని పెంచి బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించడంతో పాటు సిక్కింను భారత్‌లో విలీనం చేశారని గుర్తుచేశారు. ఇంత చేసినా కాంగ్రెస్ నేతలకు ఎన్నడూ అహంకారం లేదని, కానీ ప్రస్తుత పాలకులు కేవలం పేర్లు మారుస్తూ తామే అంతా చేశామంటూ ఎర్రకోట వేదికగా అసత్య ప్రచారాలు చేసుకుంటూ ఘనతను దక్కించుకుంటున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు.

పార్లమెంట్‌లో విద్యార్థుల సమస్యలు, వారికి జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తే సమాధానం చెప్పే ధైర్యం లేక ప్రధానమంత్రి, హోంమంత్రి సభకు హాజరు కాకుండా ఛాంబర్లో కూర్చున్నారని ఖర్గే మండిపడ్డారు.

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్


# ఎర్రకోటపై మోదీ.. వికసిత్ భారత్ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

'2014 తర్వాత 40 దేశాలతో ట్రేడ్ అగ్రిమెంట్లు చేశాము.. మన టెక్స్‌టైల్, ఫార్మా, మత్స్య సంపద మనల్ని రక్షిస్తోంది. రాబోయే 7,8 ఏళ్లలో సెమీకండక్టర్స్ ప్లాంట్లు సత్ఫలితాలు ఇస్తాయి. ఇంధన రంగం, ఇంధన భద్రత విషయంలో ముందడుగు పడింది. న్యూక్లియర్ ఎనర్జీ వైపు దేశం అడుగులు వేస్తోంది. రాబోయే ఐదేళ్లో 5 కొత్త న్యూక్లియర్ ప్లాంట్లు నిర్మిస్తాము. 2047 నాటికి 100 గిగావాట్ల న్యూక్లియర్ ఎనర్జీ సృష్టిస్తాము. సోలార్ పవర్ 2 గిగావాట్ల నుంచి 100 గిగా వాట్లకు పెంచాము. దేశంలో తొలి హైడ్రోజన్ రైలు కూడా పరుగులు పెడుతోంది' అని కీలక అంశాలను ప్రస్తావించారు.

'క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తిని గణనీయంగా పెంచాము. డిజిటల్ మినరల్స్‌పై దృష్టి పెట్టాము.. అనేక దేశాలతో క్రిటికల్ మినరల్స్‌పై ఒప్పందాలు చేసుకున్నాము. సప్తధార శక్తితో దేశానికి మరింత ఊతం ఇస్తాం.. వీటిలో మొదటిది తయారీ శక్తి. తయారీ రంగంలో మరికొన్ని కొత్త ఆవిష్కరణలు రావాలి. సప్తధారలో రెండోది ఫుడ్ ప్రొడక్షన్.. డిజైన్ నుంచి తయారీ వరకు భారత్‌ని గ్లోబల్ సప్లై చైన్‌గా మార్చాలి.. గ్లోబల్ మార్కెట్‌లో మన వస్తువులు నాణ్యతగా ఉండాలి. మన పళ్లు, మసాలాలు, ఆహార పదార్థాలు ప్రపంచంలో మంచి డిమాండ్ ఉంది. మన ఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ కెమికల్ ఫ్రీగా ఉండాలి. అలాగే సముద్ర మంథన్‌తో కొత్త ఉత్పత్తులు వస్తున్నాయి. 1.75 ఇళ్లకు గ్యాస్ పైప్‌లైన్లు.. 50 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెల్స్. దేశవ్యాప్తంగా మెట్రోరైళ్ల సదుపాయాలు పెంచాము. దేశంలోని పలు రాష్ట్రాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తుల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలుస్తోంది' అన్నారు ప్రధాని.

# దేశ నిర్మాణమే ధ్యేయం.. చంద్రబాబు సంకల్పం

మొదటి పేజీ తరువాయి

ప్రతి పౌరుడు 'నా దేశం, నా బాధ్యత' అని ముందుకుసాగాలన్నారు ముఖ్యమంత్రి. 'దేశం నాకు ఏం చేసిందని కాదు.. దేశానికి నేను ఏం చేయగలను' అని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ 2047 నాటికి వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న లక్ష్యంలో భాగస్వామ్యం అవ్వాలన్నారు. 100 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకోనే నాటికి దేశం, రాష్ట్రం వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలని ఆకాంక్షించారు. స్వర్ణాంధ్ర సంకల్పంతో ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ వన్‌గా నిలిపేందుకు అందరం కలిసి ఐక్యంగా ముందుకు సాగాలన్నారు.. వచ్చే 20 ఏళ్లు కష్టపడి పనిచేయాలన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు ఎన్నోసార్లు సవాళ్లు, సంక్షోభాలు ఎదురయ్యాయని.. గత పాలకులు ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారన్నారు చంద్రబాబు. 2024 ఎన్నికల్లో కూటమికి రాష్ట్ర ప్రజలు అద్భుత విజయాన్ని అందించారని.. కూటమి ప్రభుత్వ పాలనలో విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగు వేస్తున్నామన్నారు. ఏపీకి కేంద్రం సహకారంతో కొత్త ఊపిరి వచ్చిందని.. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా 10 సూత్రాలతో పాలన చేస్తున్నామన్నారు. ఈ లక్ష్యసాధన కోసం కార్యాచరణను సిద్ధం చేసుకుని.. ప్రతి గ్రామం, ప్రతి జిల్లా అభివృద్ధి చెందేలా ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో.. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లుగా అభివృద్ధి చేస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయజెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి ప్రసంగించారు. భారత్ బలంగా, సమర్థవంతమైన దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా అడుగులు వేస్తుందన్నారు పవన్. కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ కూడా తనదైన పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ కూడా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు పవన్ కళ్యాణ్.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 92 శాతం అధికంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిని మరింత వేగవంతం చేసి తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వ్యవసాయాన్ని రైతులకు పండుగగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతు భరోసా కింద ఇప్పటివరకు రూ.36 వేల కోట్లు రైతులకు అందించినట్లు తెలిపారు. మొత్తంగా రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ సరికొత్త రికార్డులను అధిగమిస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్ర రైతాంగానికి సాగునీరు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సీఎం తెలిపారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి రైతులకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ రంగంతోపాటు నివాస గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. విద్యుత్, సాగునీరు, రైతు పెట్టుబడి సాయం వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా ఉన్నాయని వివరించారు.

ఎర్రకోటపై ప్రధాని మోదీ స్పీచ్ హైలెట్స్

మహిళలు, ఆడబిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను కూడా సీఎం ప్రస్తావించారు. కల్యాణలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందించినట్లు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డలను భవిష్యత్తులో వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉపాధి, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి వర్గాన్ని భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేసింది. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా సమాన అవకాశాలు, అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ అందేలా పాలన సాగించడమే లక్ష్యమని సీఎం పేర్కొన్నారు.

# మోడీ ఫొటోపై పీసీసీ చీఫ్ ఫైర్



**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** రేషన్ కార్డుల వంటి సంక్షేమ పథకాలపై ప్రధాని నరేంద్ర మోడీ ఫొటోలు ఉండాలని బీజేపీ నేతలు చేస్తున్న డిమాండ్‌పై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. ప్రజలకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టకుండా, అనవసరమైన అంశాలతో రాజకీయాలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అర్హులైన పేదలకు ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా అందలేదని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. అప్పుడు మౌనంగా ఉన్న బీజేపీ నేతలు, ఇప్పుడు ప్రధాని మోడీ ఫొటోలను రేషన్ కార్డులపై ముద్రించాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. "ప్రధాని మోడీ ఫొటో లేకపోతే ఉద్యమం చేస్తామనడం వారి విద్వేశ రాజకీయ ఆలోచనలకు నిదర్శనం. దేశాన్ని, పదవులను ఎలా గౌరవించాలో కాంగ్రెస్ పార్టీకి బాగా తెలుసు, ఈ విషయంలో మాకు ఎవరి సర్టిఫికెట్లు అవసరం లేదు. మేము ప్రజా సమస్యల కోసం ఎన్నో ఉద్యమాలు చేశాం, కానీ ఇలాంటి అర్థం లేని డిమాండ్ల కోసం కాదు" అని ఆయన స్పష్టం చేశారు.

విభజన హామీలపై దృష్టి పెట్టండి..

బీజేపీ నేతలు ప్రజా ప్రయోజనం లేని అంశాలను పక్కన పెట్టి, విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల అమలుపై కేంద్రంపై ఒత్తిడి తేవాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీజేపీ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన ఆరోపించారు.

# కాంగ్రెస్ చేరికలపై రాజగోపాల్ రెడ్డి ఫైర్

**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** టీకాంగ్రెస్ లో మరోసారి అసంతృప్త స్వరాలు భగ్గుమంటున్నాయి. పార్టీలో పాత నేతలకు ప్రయార్టీ తగ్గి బయటి నేతల ఆధిపత్యం పెరిగిందంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. రాజగోపాల్ రెడ్డి హద్దు మీరి మాట్లాడవద్దని ఆయన తన లిమిట్స్ లో ఉండాలంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించగా.. మహేశ్ కుమార్ గౌడ్ చేసిన హెచ్చరికలపై రాజగోపాల్ రెడ్డి అంతే ఘాటుగా స్పందించారు. నేను పార్టీ లైన్ దాటలేదని, వ్యక్తిగతంగా నేను ఎవరినీ విమర్శించలేదన్నారు. నా మాటలను మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకువెళ్లినా ఇబ్బందేమీ లేదని స్పష్టం చేశారు. చేరికల విషయంలో గతంలో కేసీఆర్ చేసిన తప్పిదాన్నే కాంగ్రెస్ చేస్తోందని, ఎంఐఎం, సీపీఐ సపోర్టు ఉండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవాల్సిన అవసరం ఏమొచ్చిదని సొంత నేతలపై విరుచుకుపడ్డారు.

వచ్చినోళ్లకు బుద్ధి లేదు.. తీసుకున్నోళ్లకు బుద్ధి లేదు:

తాజాగా ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. పోచారం శ్రీనివాస్ రెడ్డి, దానం నాగేందర్ చేరికలపై ఘాటుగా రియాక్ట్ అయ్యారు. బీఆర్ఎస్ బీ-ఫామ్ పై గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ లోకి తీసుకోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చినోళ్లకు, చేర్చుకున్నోళ్లకు బుద్ధిలేదంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. గతంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పీకర్ స్థానంలో ఉండి కాంగ్రెస్ పార్టీ నాశనం అయ్యేలా వ్యవహరించారని అలాంటి వ్యక్తిని పార్టీలోకి ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పతనానికి కేసీఆర్ నంబర్ వన్ అయితే నెంబర్ టూ పోచారమేనని అలాంటి వ్యక్తి కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు వచ్చారు? ఆయన్ను ఎవరు రప్పించారని ప్రశ్నించారు. పార్టీలో చేరాక ఇప్పుడు తనకు బాధ అనిపిస్తోందని పోచారం మాట్లాడడం విడ్డూరంగా ఉందని అలాంటప్పుడు ఆయన్ను పార్టీలో ఎవరు ఉండమన్నారు వెళ్లిపోవాలన్నారు.

ఆయన్ను చూస్తే నాయకుల మీద గౌరవం పోతుంది

ఇక దానం నాగేందర్ లాంటి వాళ్లను చూస్తే జనాల్లో రాజకీయ నాయకుల మీద ఉండే గౌరవం పోతుందని ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేశారన్నారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని అంటున్నాడు. ఇదేం చిల్లర రాజకీయం అని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కాంగ్రెస్ పార్టీకి నష్టం చేసిన వారిని పార్టీలోకి చేర్చుకోవద్దన్నారు. పార్టీ బలోపేతం చేర్చుకోవద్దన్నారు. చేరికల విషయంలో కాంగ్రెస్ హైకమాండ్ కు అన్ని తెలుసన్నారు.

నాకు చెప్పే బదులు రేవంత్ రెడ్డికి చెప్పాలి:

మహేశ్ కుమార్ గౌడ్ నాకు చెప్పే బదులు చేరికలపై మనం తప్పు చేస్తున్నామని, మన పార్టీ గౌరవం కాపాడుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అవినీతి రహిత ప్రజాపాలన అందించాలని కోరుకుంటున్నానన్నారు. తన వ్యాఖ్యలు పార్టీకి మేలు చేస్తాయే తప్ప నష్టం చేయవని తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు.

# వందేమాతరంపై వివాదం



**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** దేశ 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ కాంగ్రెస్ అగ్రనేత, సీపీపీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం 'వందేమాతరం' గీతాలాపన జరుగుతుండగా.. ఆమె గేయాన్ని మధ్యలో ఆపాలంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. జాతీయ గేయం కొనసాగుతుండగానే సోనియా గాంధీ 'ఆపండి' అంటూ చేతులతో సైగలు చేయడం, పక్కనే ఉన్న మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో అసహనంగా వాదించడం, ఆ వెంటనే నిర్వాహకుడిని పిలిచి గీతాన్ని నిలిపివేయాలని ఆదేశించినట్లు ఉన్న వీడియో వైరల్‌గా మారింది.

జాతీయ గేయం ఆలాపనను అవమానించేలా మధ్యలోనే అడ్డుకోవడంపై నెటిజన్లు, విపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. దేశ స్వాతంత్ర్యోద్యమానికి ప్రాణవాయువు గా నిలిచిన 'వందేమాతరం' పట్ల కాంగ్రెస్ అగ్ర నాయకత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అంటూ నెట్టింట ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎలాంటి సమస్య, ప్రోటోకాల్ పొరపాటు ఉన్నప్పటికీ, దేశభక్తిని చాటే జాతీయ గేయం పూర్తయ్యే వరకు కనీస గౌరవంతో నిలబడకుండా మధ్యలోనే ఆపించేయడం దారుణమని విమర్శకులు ధ్వజమెత్తుతున్నారు. ప్రస్తుతం ఈ వీడియో రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారి తీవ్ర దుమారానికి దారితీసింది. మరికొంత మంది మాత్రం ఇది పూర్తి అవాస్తవం అని, సోనియా గాంధీ వందేమాతరం గీతాన్ని ఆపాలని చెప్పలేదని, అది వేరే సిచువేషన్ అంటూ ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. ఏది ఏమైనప్పటికి 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేళ సోనియా గాంధీ చిక్కుల్లో పడ్డారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారిన ఈ వీడియో నిజమో కాదో తెలియాలంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పల్లీ పట్టీలపై షాకింగ్ తనిఖీలు




**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** ప్రభుత్వం ఎన్ని హెచ్చరికలు చేసినా కొంత మంది అక్రమ వ్యాపారుల తీరు మారడం లేదు. తాజాగా రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో అధికారులు జరిపిన మెరుపు దాడిలో నాణ్యతలేని పదార్థాలతో తయారు చేస్తున్న సోన్ పాపిడి, పల్లీ పట్టీ/చిక్కీలను గుర్తించారు. బొంగ్లూర్ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న 'KSM ఫుడ్ ప్రొడక్ట్స్' తయారీ యూనిట్‌పై శామీర్ పేట్ టాస్క్‌ఫోర్స్, H-FAST టీమ్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్ర వాతావరణంలో, గడువు ముగిసిన ముడి పదార్థాలు, లేబుల్స్ లేని ఫ్లేవర్లతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు అధికారులు ఈ సోదాల్లో గుర్తించారు.

ఇద్దరి అరెస్ట్ – కేసు నమోదు:

తనిఖీల్లో భాగంగా యూనిట్ నుండి సోన్ పాపిడి, పల్లీ పట్టీ (చిక్కీ), బెల్లం, మైదా, వివిధ రకాల ఫ్లేవర్లతో పాటు గడువు తీరిన ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పదార్థాల విలువ సుమారు రూ. 4.07 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలు తయారు చేస్తున్న యూనిట్ యజమాని మహ్మద్ ఖలీద్ (38), మేనేజర్ సంతోష్ కుమార్ (44)లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల నివేదిక అనంతరం నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న సరుకును ఆదిబట్ల పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై ఆదిబట్ల పోలీసులు బిఎన్ఎస్ సెక్షన్లు 275, 318(4) కింద క్రైమ్ నంబర్ 659/2026 తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్యాకేజ్డ్ ఫుడ్ కొనుగోలు చేసే ముందు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్యాకెట్లపై తయారీ తేదీ, గడువు తేదీ, బ్యాచ్ నంబర్, పదార్థాల వివరాలు మరియు సరైన లేబులింగ్ ఉన్నాయో లేదో తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన, ప్యాకింగ్ దెబ్బతిన్న లేదా లేబుల్స్ లేని ఆహార పదార్థాలను కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు.

# నేల నుంచి మంటలు



**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** జార్ఖండ్‌లోని బొకారో జిల్లా గోమియా పరిధిలో ఒక వింత ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తోంది. ఉన్నట్టుండి నేల నుంచి మంటలు ఎగిసిపడటంతో అక్కడ తీవ్ర కలకలం రేపింది. ఈ వింత ఘటనను చూసేందుకు స్థానికులు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకోగా స్థానిక అధికారిక యంత్రాంగం అప్రమత్తమైంది. భూమి లోపలి నుంచి వాయువులు లీకేజీ కావడం వల్లే ఈ మెంటలు చెలరేగుతున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రస్తుతం స్థానిక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నారు. వాయువు లీకేజీకి గల అసలు కారణాలను తెలుసుకునేందుకు నిపుణుల బృందం రంగంలోకి దిగింది.

సమీపంలోనే ఒఎన్జీసీ ప్రాజెక్టు:

అయితే మంటలు చెలరేగుతున్న ఈ ప్రాంతానికి సమీపంలోనే ఒఎన్జీసీకి చెందిన బొకారో నదీ తీర గ్యాస్ ప్రాజెక్టు కొనసాగుతోంది. అక్కడ భూగర్భ మీథేన్ వాయు వనరుల వెలికితీత, నిల్వతో పాటు గెయిల్ సంస్థకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసే పనులు జరుగుతుంటాయి. అయితే, ప్రస్తుతం భూమిలోంచి వస్తున్న ఈ మంటలకు ఒఎన్జీసీ ప్రాజెక్టుకు ఏమైనా సంబంధం ఉందా లేదా సహజసిద్ధంగానే భూగర్భ వాయువులు లీక్ అవుతున్నాయా అనే విషయాన్ని అధికారులు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. ప్రమాద తీవ్రత దృష్ట్యా, మంటలు వస్తున్న ప్రాంతానికి ప్రజలెవరూ దగ్గరకు వెళ్లవద్దని, సురక్షిత దూరంలో ఉండాలని అధికారులు హెచ్చరించారు. పూర్తిస్థాయి దర్యాప్తు పూర్తయిన తర్వాతే ఈ ఘటనకు సంబంధించిన నిజానిజాలు బయటకు వస్తాయి.

# దేశ ప్రగతిపై ఖర్గే ఫైర్




**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** ఆధునిక, ప్రజాస్వామిక, లౌకిక భారతదేశ నిర్మాణానికి పునాది వేసింది కాంగ్రెస్ పార్టీయేనని, ప్రస్తుత దేశాభివృద్ధిలో 90 శాతం కాంగ్రెస్ పార్టీ కృషియే ఉందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నెహ్రూ ఐఐటీలు, ఐఐఎంలు, పీఎస్‌యూలను స్థాపించి దేశాన్ని ప్రగతిపథంలో నడిపించారని, లాల్ బహదూర్ శాస్త్రి హరిత, శ్వేత విప్లవాలకు బాటలు వేశారని, ఇందిరా గాంధీ సైనిక పాటవాన్ని పెంచి బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించడంతో పాటు సిక్కింను భారత్‌లో విలీనం చేశారని గుర్తుచేశారు. ఇంత చేసినా కాంగ్రెస్ నేతలకు ఎన్నడూ అహంకారం లేదని, కానీ ప్రస్తుత పాలకులు కేవలం పేర్లు మారుస్తూ తామే అంతా చేశామంటూ ఎర్రకోట వేదికగా అసత్య ప్రచారాలు చేసుకుంటూ ఘనతను దక్కించుకుంటున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు.

పార్లమెంట్‌లో విద్యార్థుల సమస్యలు, వారికి జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తే సమాధానం చెప్పే ధైర్యం లేక ప్రధానమంత్రి, హోంమంత్రి సభకు హాజరు కాకుండా ఛాంబర్లో కూర్చున్నారని ఖర్గే మండిపడ్డారు. ప్రజలు తమ సమస్యలపై గళమెత్తేందుకు ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటే, ఇంట్లో లేదా గదుల్లో కూర్చోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని అన్నారు. నేడు దేశంలో యువత కలలు కల్లలవుతున్నాయని, తమ హక్కుల కోసం ఆందోళనలు చేస్తున్న యువతను దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ ద్వేషపూరిత ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి నేటి వరకు హిందూ-ముస్లింల మధ్య చిచ్చుపెడుతూ పేదలను అణచివేస్తున్న బీజేపీ-ఆర్ఎస్ఎస్ విధానాలపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.


# తిరంగా యాత్రకు అడ్డంకులు



**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జేఎస్ఎస్సీ ఉద్యోగ నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ రోజు విద్యార్థులు, అభ్యర్థులు తిరంగ యాత్రకు పిలుపునిచ్చారు. దీంతో విద్యార్థి నాయకుడు, జేఎల్‌కేఎం నేత దేవేంద్ర నాథ్ మహతోను పోలీసులు ఆసుపత్రి నుంచి బయటకు రాకుండా అడ్డుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గత 14 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న ఆయన, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో విద్యార్థులు చేపట్టిన 'తిరంగా యాత్ర'లో పాల్గొనేందుకు యత్నించారు. అయితే ఆయన ఆరోగ్యం దృష్ట్యా, శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో రాంచీలోని సదర్ ఆసుపత్రి ప్రాంగణంలో భారీగా మోహరించిన పోలీసులు ఆయనను బయటకు వెళ్లకుండా నిలువరించారు.

ఈ క్రమంలో పోలీసులకు, ఆయన మద్దతుదారులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో దేవేంద్ర నాథ్ మహతో స్వల్పంగా గాయపడటంతో పాటు ఛాతీ నొప్పితో బాధపడుతుండటంతో ఆసుపత్రి ఐసీయూ/హెచ్‌డీయూలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. సొంత దేశంలో స్వాతంత్ర్య దినోత్సవం వేళ జాతీయ జెండాను ఎగురవేయడానికి, శాంతియుతంగా తిరంగా యాత్రలో పాల్గొనడానికి కూడా అనుమతించకపోవడం ఏ రకమైన స్వేచ్ఛ అని ఆయన సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అసెంబ్లీ ముట్టడి సందర్భంగా గాయపడి ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి ఆయన దీక్ష కొనసాగిస్తున్నారు. నిరుద్యోగ అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, పరీక్షల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకారులు తమ నిరసనలను కొనసాగిస్తున్నారు.

# ఇండోనేషియాలో భారీ భూకంపం



**న్యూస్ డెస్క్, 15 ఆగష్టు (బిఎన్ఎస్):** తూర్పు ఇండోనేషియాలోని ఫ్లోరెస్ దీవి సమీపంలో సంభవించిన భారీ భూకంపం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7.7 తీవ్రతతో సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతులో సంభవించిన ఈ పెను ప్రకంపనల ధాటికి పలు నివాసాలు, భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద చిక్కుకుని ఇప్పటివరకు కనీసం 20 మంది మృతి చెందినట్లు, పలువురు గాయపడినట్లు సహాయక బృందాలు, అధికార వర్గాలు ధ్రువీకరించాయి. గత కొన్ని దశాబ్దాల్లో ఈ ప్రాంతంలో సంభవించిన అత్యంత శక్తివంతమైన భూకంపాలలో ఇది ఒకటిగా అధికారులు పేర్కొన్నారు. తీరప్రాంతాల్లో భూమి కంపించడంతో ప్రారంభంలో సునామీ హెచ్చరికలు జారీ చేసి ప్రజలను ఎత్తైన ప్రాంతాలకు తరలించారు, అనంతరం ఆ ముప్పు తొలగి పోయింది.

భూకంపం ధాటికి రహదారులు బీటలు వారడం, కొండచరియలు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉంటారనే అనుమానంతో ఇండోనేషియా విపత్తు నిర్వహణ సంస్థ, సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. కాగా, ప్రపంచవ్యాప్తంగా ఇటీవలి కాలంలో సంభవించిన ప్రకృతి విపత్తుల్లో కొలంబియా భూకంపంలో 287 మంది, వెనిజులాలో 6 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలు ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన విషయం తెలిసిందే. ఈ విపత్తుకు సంబంధించిన పూర్తి నష్టాల వివరాలు, సహాయక చర్యల తాజా నివేదికలను అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోంది.

# మైదుకూరులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా

## మహనీయుల త్యాగాల ఫలితమే 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్..

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 15:

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మైదుకూరు నియోజకవర్గంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొని ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

మొదటగా మున్సిపాలిటీ పరిధిలోని రాయల్ సర్కిల్, నాలుగు రోడ్ల కూడలి వద్ద నిర్వహించిన జాతీయ జెండా వందన కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను కొనియాడుతూ, వారి త్యాగాల ఫలితంగానే మనం ఈరోజు స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామని పేర్కొన్నారు.

**విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం**

జాతీయ జెండా వందనం అనంతరం అక్కడ పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే పుట్టా ప్రేరణాత్మక సందేశంతో ప్రసంగించారు.

విద్యార్థి దశ అనేది జీవితంలో అత్యంత విలువైన దశ అని, ఈ దశలోనే భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మీరు సాధించే ప్రతి విజయం మీ కుటుంబానికే కాదు, మన సమాజానికి, మన రాష్ట్రానికి, మన దేశానికి గర్వకారణంగా ఉండే విధంగా నిలవాలంటు విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. విద్యార్థులు కేవలం ఉద్యోగం కోసం కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా తమ ప్రతిభను పెంపొందించుకోవాలని, మంచి విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, నైతిక విలువలు, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.



**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.**

అనంతరం ఎమ్మెల్యే పుట్టా వనిపెంట రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బందితో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకానికి గౌరవం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి భావాలను ప్రతిబింబించే కార్యక్రమాలను అభినందించారు. యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యత, సేవాభావాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే పుట్టా వివరించారు. దేశం మనకు ఇచ్చిన స్వేచ్ఛను గౌరవిస్తూ దేశ అభివృద్ధికి మన వంతు కృషి చేస్తూ మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, భారతదేశాన్ని మరింత శక్తివంతమైన, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే మనందరి బాధ్యత అని విద్యార్థుల ఉద్దేశించి తెలిపారు.

# రోడ్డు భవనాల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే పుట్టా..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 15:

కడప ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ. జనార్ధన్ రెడ్డిని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కలిసి మైదుకూరు నియోజకవర్గంలో రోడ్లు, భవనాలు మరియు మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై మంత్రితో చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడానికి ఎమ్మెల్యేగా నిరంతరం కృషి చేస్తానని పుట్టా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా తో పాటు మైదుకూరు పట్టణ అధ్యక్షులు మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ దాసరి బాబు, మిల్లు శ్రీను మంత్రికి తెలియజేస్తూ.. మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

# నాటి మహనీయుల త్యాగ ఫలితమే.. నేడు భారతావనికి స్వతంత్ర దినోత్సవం..

## అమరవీరుల త్యాగంతోనే మన స్వేచ్ఛ జీవితం సాధ్యం.. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 15:

వందల ఏళ్ల పాటు రాక్షస పాలనలో నరకం చూసిన భారతీయులకు స్వేచ్ఛ జీవితం ప్రసాదించాలని ఎందరో మహనీయులు తమ ధన, మాన, ప్రాణాలను త్యాగం చేసి భారతదేశానికి స్వాతంత్రం కోసం ఎన్నో వీరోచిత పోరాటాలు చేసి సాధించిన స్వాతంత్రం వల్లనే నేడు భారతదేశం ఎంతో సుఖ సంతోషాలతో విరాజిల్లుతోందని అలాంటి మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ వారిని స్మరించుకోవాలి అంటూ రాష్ట్ర ప్రభుత్వ విప్ జమ్మలమడుగు శాసనసభ్యులు ఆది నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఈరోజు 80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపల్, హాస్పిటల్, హౌసింగ్ శాఖ, ఎంపీడీవో కార్యాలయంలో, ప్రభుత్వ బాలికల హైస్కూల్లో, ఈడిగపేట హైస్కూల్లో మరియు భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మువ్వన్నెల జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఎందరో మహానుభావులు ఏళ్లపాటు పోరాడి జైలు జీవితం అనుభవించి కఠోర శిక్షలు అనుభవించి శాంతియుత పోరాటాలు, తిరుగుబాట్లు చేసి బ్రిటిష్ వారితో పోరాడి మనకు స్వాతంత్రం తెచ్చిపెట్టారని తెలిపారు. అందువల్లే నేడు మనం స్వేచ్ఛ వాయువులో జీవిస్తున్నామని అలాంటి మహోన్నత వ్యక్తులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నేడు భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ భరతమాత గర్వించేలా సేవా, సౌభ్రాతృత్వం, ఇతరుల పట్ల ప్రేమగా మెలగడం, తోటి వారికి సహాయ పడడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో భారత దేశంలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వాటి వల్ల నేడు భారతదేశము ప్రపంచానికే దిశానిర్దేశంగా అభివృద్ధి చెందుతూ ఉందని సూచించారు. రాబోయే కాలంలో అన్ని రంగాల్లో భారతదేశం అభివృద్ధి చెంది అగ్రస్థానంలో నిలుస్తుందని ప్రపంచ దేశాలు మన దేశం వైపు తిరిగి చూసేటట్లుగా దేశంలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతున్నాయని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ



తమ తోటి వారికి సహాయ సహకారాలు అందించేందుకు ముందుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయదున్నిసా, డిఈ కిరణ్, ఐసిడిఎస్ సిడిపిఓ జయమ్మ, ఆయా శాఖల అధికారులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, కూటమి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# డీఎస్ఎన్ఎల్‌యూలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



విశాఖపట్నం: దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (డీఎస్ఎన్ఎల్‌యూ)లో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ డి. సూర్య ప్రకాశ రావు జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం సమర్పించారు.

ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం సాధించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ ప్రగతిని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య సమరంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసి, అకుంఠిత దీక్ష, పట్టుదలతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగస్ఫూర్తి, దేశభక్తి, పట్టుదలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులు క్రమశిక్షణ, నిబద్ధతతో విద్యను అభ్యసించి దేశ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచంలోనే అత్యున్నత స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన ఉద్బోధించారు.

కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ రిజిస్ట్రార్ ఇన్‌చార్జి డా. విశ్వచంద్రనాథ్ మాదాసు, అకడమిక్ అఫైర్స్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ డా. సోమా భట్టాచార్య, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకల్లో దేశభక్తి, జాతీయ స్ఫూర్తి వెల్లివిరిసింది.

# దేవాదుల ప్రాజెక్టు పూర్తికి అత్యంత ప్రాధాన్యం: మంత్రి ఉత్తమ్

నల్లగొండ (బిఎన్ఎస్): రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలకు సాగునీటి ప్రయోజనం చేకూర్చే దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో కార్యరూపంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా దేవాదుల ఫేజ్--VIను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి, సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలను తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు... సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ... దేవాదుల ఫేజ్--VIతోపాటు సూర్యాపేట జిల్లాలో మరో 77వేల అదనపు ఆయకట్టు లభించేలా సుమారు 2,392 కోట్ల వ్యయంతో మూడు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వెల్లడించారు.. ప్రస్తుత వర్షపాతం తో పాటు నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ స్టేజ్--II, మూసీ తదితర వ్యవస్థల్లో నీటి లభ్యతను నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు... నాగార్జునసాగర్ ఎడమ కాలువతోపాటు అనుబంధ కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం 396 కోట్లు, మూసీ ప్రాజెక్టు కాలువల ఆధునీకరణకు మరో 70 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. రైతు సంక్షేమం--ఆహార భద్రత రెండు కళ్ళగా...నిరభుత్వం పనిచేస్తుందని ఇందుకోసం సూర్యాపేట జిల్లాలో 3.82 లక్షలకు పైగా ఆహార భద్రత కార్డులు పంపిణీ చేస్తున్నామని అన్నారు..



# దేశభక్తి స్ఫూర్తితో బీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థల్లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 15:

దేశభక్తి, జాతీయ స్ఫూర్తి, ఉత్సాహభరిత వాతావరణం నడుమ బీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ వేడుకలకు విద్యాసంస్థల కరస్పాండెంట్, మరియు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీరం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రూప్-1 అధికారి బీరం శ్రీకాంత్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. బీరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను అలవర్చుకుని దేశ భవిష్యత్తును నిర్మించే శక్తిగా ఎదగాలని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే అది విద్యార్థుల వలననే అవుతుందని వారు తెలిపారు. విద్యార్థుల అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి గీతాలు, నృత్యాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రదర్శనలకు అతిథులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ సరస్వతమ్మ, పాఠశాల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమ్ చందర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. దేశభక్తి నినాదాలతో ప్రాంగణం మార్మోగగా, జాతీయ గీతంతో కార్యక్రమం ఘనంగా ముగిసింది.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణం ఆగస్టు 15న త్రివర్ణ పతాకాలతో, దేశభక్తి ఉత్సాహంతో నిండిపోయింది. పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ ఎల్ . నరసింహారెడ్డి, గౌరవ అతిథిగా డా. చామర్తి ఉమామహేశ్వరావు, కార్యదర్శి ఎన్వీకే విశ్వేశ్వరావు, కోశాధికారి పసర్తి మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు రమ విశ్వనాథన్, కమిటీ సభ్యులు మేంగాని వెంకటస్వామి, పూర్వ ఛాత్ర పరిషత్ సహ సంయోజక్ రాజారెడ్డి విచ్చేసి వేడుకలలో పాల్గొన్నారు.

పాఠశాల మైదానంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ముఖ్య అతిథులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. 10వ తరగతి విద్యార్థిని హర్షిత ఈ రోజు యొక్క ప్రాముఖ్యతను సభకు వివరించారు. అనంతరం పాఠశాల మంత్రిమండలి విద్యార్థులు, ఎన్సిసి క్యాడెట్లు బ్యాండ్ ఘోష్ నడుమ ఆకట్టుకునే మార్చ్ పాస్ట్ నిర్వహించారు. విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గేయాలు, ప్రదర్శించిన నృత్యాలు మరియు వయుక్తిక్ గీతాలతో పాఠశాల ప్రాంగణమంతా దేశభక్తి స్ఫూర్తితో నిండిపోయింది.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యారణ్య పాఠశాల ప్రాంగణంలోని ప్రతి అణువులో దైవభక్తి మరియు దేశభక్తి కనిపిస్తున్నాయని అన్నారు. ఇలాంటి వాతావరణం ద్వారానే మనం ఉన్నతమైన దేశభక్తులుగా, బాధ్యత గల పౌరులుగా తయారవ్వగలమని తెలిపారు. 10, 11వ శతాబ్దాలలో భారతదేశం విశ్వ గురువుగా విరాజిల్లిందని, అనంతరం ముస్లింలు, బ్రిటిషర్ల పాలనలో దేశం సందిగ్ధంలో ఉన్నప్పటికీ వీరసావర్కర్, సుభాష్ చంద్రబోస్, జతిన్ దాస్, రాంప్రసాద్ బిస్మిల్ వంటి ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మనకు స్వతంత్ర భారతాన్ని అందించారని గుర్తుచేశారు. ఆ వైభవాన్ని మనం మన ప్రతిభతో ముందుకు తీసుకెళ్లి భారతదేశాన్ని తిరిగి విశ్వ గురువుగా నిలపాలని పిలుపునిచ్చారు.

గౌరవ అతిథి డా. చామర్తి ఉమామహేశ్వరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తైనా దేశం ఇంకా సాధించాల్సింది చాలా ఉందని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో జరిగిన త్యాగాలను గుర్తుపెట్టుకోవడానికి, ముస్లిం మరియు బ్రిటిష్ పరిపాలనలో భారతదేశం ఎదుర్కొన్న కష్టాలనుండి ఎలా బయటపడిందో తెలుసుకోవడానికి, గతంలో ఉన్న విశ్వగురు స్థానాన్ని గుర్తు చేసుకోవడానికి మనం స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవాలని అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం ఇవ్వడానికి సిద్ధపడే సంకల్పంతో ప్రతి ఒక్కరూ ఉండాలని పిలుపునిచ్చారు. వ్యక్తి నిర్మాణంలో శ్రద్ధ ఎంత ముఖ్యమో నచికేతుడు మరియు అష్టావక్రుని కథల ద్వారా వివరించారు. చిన్నతనం నుండే తమ ప్రజ్ఞపై శ్రద్ధ వహించి ఉన్నతమైన వ్యక్తులుగా తయారై దేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు ముందడుగు వేయాలని విద్యార్థులకు సూచించారు.

చివరగా వివిధ రంగాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమ విశ్వనాథన్ సమన్వయం చేశారు.

# వరంగల్-హైదరాబాద్ హైవేపై ప్రమాదం: బాలిక మృతి



మేడ్చల్,బిఎన్ఎస్: వరంగల్-హైదరాబాద్ హైవేపై ఘట్‌కేసర్ వద్ద జరిగిన ప్రమాదంలో బాలిక మృతి చెందింది. వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో శ్రావణి (17) అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక తల్లిదండ్రులు సురేశ్, ఉమకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం అనంతరం డ్రైవర్ లారీని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సినిమా న్యూస్

## 'నా చావుకు నువ్వే కారణం'

బిగ్‌బాస్ తెలుగు-10లోకి అడుగుపెట్టేందుకు నిర్వహిస్తున్న 'అగ్నిపరీక్ష' ఆడిషన్స్ ప్రస్తుతం ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈ ఆడిషన్స్‌కు హాజరైన ప్రముఖ యూట్యూబర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఉప్పల్ బాలు.. తనకు ఎదురైన అనుభవంపై సోషల్ మీడియాలో వరుసగా సెల్ఫీ వీడియోలు విడుదల చేస్తున్నారు. తాజాగా విడుదల చేసిన మరో వీడియోలో నటుడు నవదీప్‌పై ఆయన తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను ఆడిషన్స్ ఆధారంగానే ఎంపిక చేశారని గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల్లో వెల్లడించారని ఉప్పల్ బాలు పేర్కొన్నారు. అన్ని రౌండ్లలో పాస్ చేసిన అనంతరం స్టేజ్‌పైకి పిలిచి నవదీప్ తనను తీవ్రంగా అవమానించారని ఆరోపించారు.



నువ్వు ట్రాన్స్‌జెండర్‌వా?

"నువ్వు ట్రాన్స్‌జెండర్‌వా? నీకు ఫ్యాన్స్ ఉన్నారా? చిల్లర వీడియోలు చేస్తావు" అంటూ నవదీప్ తనను అవమానించారని వీడియోలో పేర్కొన్నారు. అలాగే తెలుగు రాని ముంబై అమ్మాయిని ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించిన ఉప్పల్ బాలు.. తనకు జరిగిన వ్యవహారంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో డ్రగ్స్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ నవదీప్‌ను ఉద్దేశించి కూడా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్ వ్యవహారంలో నువ్వు దొరకలేదా.. "నీ మనస్సాక్షికి తెలుసు" అంటూ వ్యాఖ్యానించారు. తనను ఈ వ్యవహారం తీవ్రంగా బాధించిందని చెబుతూ.. "నా చావుకి నువ్వే కారణం అవుతావు.. నన్ను చాలా బాధపెట్టావు" అంటూ ఉప్పల్ బాలు వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు.

సామాన్యుల్లో బిగ్‌బాస్‌పై ఆసక్తి!

కాగా, బిగ్‌బాస్ తెలుగు-10 ప్రారంభానికి ముందు సామాన్యులకు అవకాశం కల్పించే ఉద్దేశంతో 'అగ్నిపరీక్ష' ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు. గత సీజన్‌లో కామనర్‌గా హౌస్‌లోకి వెళ్లిన కళ్యాణ్ విజేతగా నిలవడంతో ఈసారి కూడా సామాన్యుల్లో బిగ్‌బాస్‌పై ఆసక్తి పెరిగింది. ఈ క్రమంలో ఉప్పల్ బాలు ఆడిషన్స్‌కు హాజరుకావడం, అనంతరం ఆయన చేసిన ఆరోపణలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

## ఒంటరి సైనికుడిగా డార్లింగ్!

రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ యాక్షన్ డ్రామా చిత్రం 'ఫౌజీ'. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి సరికొత్త ఇంటెన్స్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది.

ప్రతి సైనికుడి స్ఫూర్తికి సెల్యూట్

రక్తం మరకలున్న బనియన్, ధోతీ ధరించి, రెండు చేతుల్లో తుపాకులు పట్టుకుని ప్రభాస్ పవర్‌ఫుల్ పోరాట యోధుడిగా కనిపిస్తున్నారు. అయితే పోస్టర్‌లో ఆయన ముఖాన్ని చూపించకుండా ఉత్కంఠను పెంచారు. అలాగే కాలిపోతున్న చార్మినార్ పరిసరాలు, పక్కనే కర్ర పట్టుకుని నడుస్తున్న గాంధీ తరహాలో వృద్ధుడి విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. క్యాప్షన్.. 'A BATTALION WHO FIGHTS ALONE' అనే ట్యాగ్‌లైన్‌తో ఒంటరి పోరాటం చేసే సైనికుడి పాత్రను పరిచయం చేశారు. "స్వాతంత్ర్యం ఒక వేడుకగా మారడానికి ముందు, అది ఒక భీకర యుద్ధం! మన రేపటి కోసం పోరాడిన ప్రతి సైనికుడి స్ఫూర్తికి సెల్యూట్" అంటూ చిత్ర యూనిట్ దేశభక్తి సందేశాన్ని పంచుకుంది.




డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల

కాగా, ఈ సినిమాలో ఇమాన్వి కథానాయికగా నటిస్తుండగా అనుపమ్ ఖేర్, జయప్రద, మిథున్ చక్రవర్తి, చైత్ర జే. ఆచార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం.. విశాల్ చంద్రశేఖర్, నిర్మాణం గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్‌ల టీ-సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో 2026 డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## 'కామ్రేడ్ కళ్యాణ్' రిలీజ్ డేట్ ఫిక్స్

వినూత్నమైన కథలతో, డిఫరెంట్ పాత్రలతో ప్రేక్షకులను అలరించే టాలీవుడ్ యంగ్ హీరో శ్రీవిష్ణు నుంచి రాబోతున్న సరికొత్త యాక్షన్ కామెడీ చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన పలు అప్డేట్స్ ఆకట్టుకోగా.. తాజాగా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. 'కామ్రేడ్ కళ్యాణ్' చిత్రం వరల్డ్‌వైడ్‌గా అక్టోబర్ 9న రిలీజ్ కాబోతున్నట్లు ప్రకటిస్తూ.. 'ఈ కామ్రేడ్ వచ్చేది విప్లవం కోసం కాదు.. థియేటర్లలో నవ్వుల విప్లవం సృష్టించడానికి' అంటూ మేకర్స్ పంచుకున్న ఈ క్రేజీ అప్‌డేట్ వైరల్‌గా మారింది. కాగా.. జానకిరామ్ మరెళ్ల దర్శకత్వంలో, కోనా ఫిలిమ్స్ కార్పోరేషన్, స్కంద వాహన మోషన్ పిక్చర్స్ పతాకాలపై అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతుంది. గతంలో 'సామజవరగమన', 'ఓం భీమ్ బుష్' వంటి వరుస హిలేరియస్ ఫ్యామిలీ బ్లాక్‌బస్టర్లతో ప్రేక్షకులను థియేటర్లలో పొట్టచెక్కలయ్యేలా నవ్వించిన శ్రీవిష్ణు, ఈ చిత్రంలో 1990ల నాటి వింటేజ్ నేపథ్యంతో కూడిన విభిన్నమైన డ్యూయల్ రోల్‌లో మరోసారి నవ్వుల పండగను ఖరారు చేశారు.





## రక్తం.. మట్టి.. విజయ్ విధ్వంసం

స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 1854-1878 కాలంలో రాయలసీమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే చారిత్రక పోరాటం ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. "మరపురాని చరిత్రలోని అత్యంత సాహసోపేతమైన అధ్యాయం" (The bravest chapter of our forgotten history) అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పోస్టర్ హైలైట్ అవుతోంది.

ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్ర్య పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.




## విరావిగా అర్జున్




వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ సంయుక్తంగా నిర్మిస్తున్న మిస్టిక్ థ్రిల్లర్ 'పొలిమేర-3'. ఈ సినిమాలో యాక్షన్ కింగ్ అర్జున్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. ఆగస్టు 15న ఆయన పుట్టిన రోజు కావడంతో అర్జున్ పాత్రను రివీల్ చేస్తూ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా 'విరావి' అనే ఓ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుపారు. అలాగే ఆయన చెయ్యి మాత్రమే కనిపించేలా ఓ పవర్ ఫుల్ ఫొటోనే షేర్ చేస్తూ.. 'యాక్షన్ కింగ్ అర్జున్ 'వీరావి'గా పొలిమేర-3 ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. వేట మొదలవుతోంది.. రహస్యం మరింతగా ముదురుతోంది.. 'ఫస్ట్ లుక్' త్వరలోనే రాబోతోంది!' అంటూ చెప్పుకొచ్చారు. కాగా.. ఓటీటీలో 'మా ఊరి పొలిమేర'తో సంచలనం సృష్టించి, 'పొలిమేర 2'తో థియేట్రికల్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న ఈ మిస్టిక్ థ్రిల్లర్ ఫ్రాంచైజ్ ఇప్పుడు తదుపరి అధ్యాయంలోకి అడుగుపెట్టింది.

విజనరీ డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'పొలిమేర 3' చిత్రాన్ని వంశీ నందిపాటి, జాన్వీ నారంగ్ నిర్మిస్తున్నారు. 'బ్లాస్ట్ జోన్'తో భారీ విజయాన్ని అందుకున్న అర్జున్.. ఈ ఫ్రాంచైజ్‌లో పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండగా ప్రేక్షకుల్లో మరింత ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. పొలిమేర, పొలిమేర-2తో తన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న ఐకానిక్ కొమురయ్య పాత్రలో సత్యం రాజేష్ మరోసారి అలరించనున్నారు. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల పాత్ర కూడా కీలకంగా ఉండనుంది. గెటప్ శ్రీను, బాలాదిత్య, రాకేందు మౌళి తదితర ప్రతిభావంతులైన నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దీంతో ఇప్పటివరకు వచ్చిన 'పొలిమేర' చిత్రాల్లోనే అతిపెద్ద తారాగణంతో 'పొలిమేర 3' తెరకెక్కుతోంది.